పరిహారం అందేనా?

- అందని గత రబీ పంట నష్ట పరిహారం
- గతంలో నిధులు విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఎన్నికల తరువాత కొందరికే అందిన సాయం
- ఎదురు చూస్తున్న రైతన్నలు


బెల్డోణలో ఎండిన శనగ పైరు (ఫైల్)

చిప్పగిరి: 2023–2024 రబీలో పంటలు నష్టపోవడంతో నాడు అధికారంలోనున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు పంట నష్టపరిహారం సొమ్ము విడుదల చేసింది. అయితే సాధారణ ఎన్నికల నోటిఫికేష్ వెలువడటం, ఎన్నికల నిర్వహణ, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టకపోవడంతో నేటికీ అధిక శాతం కర్షకులకు పరిహారం అందలేదు. మండలంలోని 16 గ్రామాల్లో గత రబీలో భాగంగా 2,786.96 హెక్టార్లలో ఎపంటలు వేశారు. అయితే వాతావరణ పరిస్థితులతో పంటలు కోల్పోయారు. నష్టపోయిన 2,643 మంది రైతులకు రూ.3,73,56,465 నష్ట పరిహారానికి అర్హులంటూ ఆయా గ్రామా సచివాలయాల్లో రైతుల జాబితా ప్రదర్శించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిహారం నిదులు కూడా విడుదల చేశారు. అయితే ఈ సమయంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, ఎన్నికల నిర్వహణ కారణంగా రైతుల ఖాతాల్లో నిధులు జమ కాలేదు. ఎన్నికలు పూర్తయిన వెంటనే కొందరి ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ కాగా.. చాలా మందికి నేటికీ జమ కాలేదు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పరిహారం అందజేత గురించి పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అర్హులైన రైతులకు పరిహారం అందజేయాలని కోరుతున్నారు. కాగా..మండలంలో నల్లరేగడి పొలాలు అధికంగా ఉండటంతో ఖరీఫ్ కంటే రబీలో ఎక్కువ పంటలు సాగవుతాయి. ఖరీఫ్‌లో కంది,సజ్జ,వేరుశనగ,కొర్ర తదితర పంటలు సాగు చేస్తే రబీలో పప్పు శనగ, పొద్దుతిరుగుడు, వాము, పత్తి తదితర పంటలు ఎక్కువగా సాగు చేస్తారు.

సాయం అందిస్తే పెట్టుబడికి తోడ్పడుతుంది



2023– 2024 సంబంధించి నష్ట పరిహారం మాకు అందలేదు. కనీసం ఇప్పుడైనా ఆ సొమ్ము అందజేస్తే ప్రస్తుతం ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన పెట్టుబడికి ఉపయోగపడుతుంది. ఆ సొమ్ము అందితే అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. గత ముఖ్యమంత్రి జగనన్న ఏ సీజన్‌లో పంటలు నష్టపోతే ఆసీజన్‌లోనే పరిహారం అందజేసేవారు. రబీలో ఇవ్వాల్సిన పరిహారానికి ఎన్నికల కోడ్ అడ్డురావడంతో మాకు సొమ్ము అందలేదు. ఆయన ఉండి ఉంటే ఈపాటికే మాకు సొమ్ము ఖాతాల్లో జమ అయ్యి ఉండేది. సాగు కూడా భారమయ్యేది కాదు. – ఓబులేసు, రైతు, బెల్డోణ

వివరాలను ఉన్నతాధికారులకు పంపాం



2023–2024 రబీ పంట నష్ట పరిహారానికి సంబంధించి వివిధ సమస్యల కారణంగా చాలా మంది రైతులకు పంట నష్ట పరిహారం అందలే. పరిహారం అందని రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ప్రభుత్వం నుంచి ఏదైనా సమాచారం వస్తే రైతులకు తెలియజేస్తాం.

– విజయలక్ష్మి, ఏఓ

క్లుప్తంగా

ఎల్లార్తి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు


ఎల్లార్తి దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

హొళగుంద: మండలంలోని ఎల్లార్తిలో వెలసిన శేక్షావలి, షాషావలి, దూదీపీర దర్గాలతో పాటు జెండాకట్టను గురువారం వివిధ ప్రాంతాల భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు దర్గాల్లో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక శాతం భక్తులు రాత్రి దర్గా పరిసరాల్లో నిద్రించారు. అలాగే..హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలతో పాటు సాయిబాబా ఆలయాలను సందర్శించి పూజలు చేశారు.

వంతెన ఎత్తు పెంచాలి

హాలహర్వి: మండలంలోని -హాలహర్వి నిట్రవట్టి రహదారిలో ఉన్న వంక బ్రిడ్జి ఎత్తు పెంచాలని జనసేన పార్టీ మండలాధ్యక్షుడు మోకా మల్లికార్జున, నాయకులు రుద్ర, శ్రీనివాసులు, తిమ్మప్ప, ఆంజనేయులు, రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వంక అవతలి వైపు ఉన్న పొలాలకు, నిట్రవట్టి గ్రామానికి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాల సమయంలో ఊరి వంకలో నీటి ప్రవాహం అధికంగా ఉంటుండటంతో వాహనాల రాకపోకలు నిలిచి పోతున్నాయని చెప్పారు. వంతెన ఎత్తు పెంచి సమస్యను పరిష్కరించాలని కోరారు.

సచివాలయాలు ఖాళీ


దౌల్తాపురం సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా కుర్చీలు

చిప్పగిరి: ప్రతి నెల ఒకటవ తారీఖు వచ్చిందంటే మడలంలోని 9 గ్రామ సచివాలయాలు ఖాళీగా మారుతున్నాయి. గురువారం మండలంలోని 9 గ్రామ సచివాలయాల పరిధిలోని 16 గ్రామాల్లో గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము పంపిణీలో పాల్గొన్నారు. చాలా గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు కాకుండా కాలనీలో ఒక చోట కూర్చొని పింఛన్ పంపిణీ చేశారు. ఇలా సిబ్బంది మొత్తం వెళ్లి పోవడంతో సచివాలయాల్లో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. వివిధ పనులపై ఆయా సచివాలయాలకు వచ్చిన ప్రజలు సిబ్బంది లేకపోవడంతో వెనుదిరిగారు.

తల్లిపాలపై అవగాహన


తల్లిపాలపై బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలూరు రూరల్: బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్లే కలిగే లాభాలపై వైద్యారోగ్య సిబ్బంది బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆలూరులో ఇంటింటికీ తిరిగి తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలలపాటు తల్లిపాలు ఇస్తే బిడ్డకు తేలికగా జీర్ణమవుతుందన్నారు. రోజుకు బిడ్డకు 8–10 సార్లు పాలు ఇవ్వాలని, రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పడితే వాటిలో ప్రొటీన్లు అధికంగా ఉండి బిడ్డకు రోగ నిరోధక శక్తి లభిస్తుందని చెప్పారు. అలాగే తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదని చెప్పారు. ఏఎన్‌ఎం యశోద, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రసవానంతరం మొదటగా వచ్చే తల్లి పాలు పుట్టిన పిల్లలకు అందించడం వల్ల బిడ్డకు అమృతం లాంటిదని, బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ వెల్దుర్తి సెక్టార్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆమె గురువారం మండలంలోని కొసనాపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అపోహలు మాని బిడ్డకు ముర్రు పాలు అందించాలని సూచించారు. కార్యకర్త హెప్సిబా, హెల్పర్ ఫాతిమా పాల్గొన్నారు.

తిలక్‌కు నివాళి


తిలక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్వాతంత్య్ర సమర యోధుడు బాలగంగాధర్ తిలక్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి స్థానిక గ్రంథాలయాధికారిణి కవితాబాయ్ పాఠకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తిలక్ లాంటి మహోన్నతుల అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

1,627 మట్టి నమూనాల సేకరణ

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాల్లోని ఎర్ర నేలలు, నల్లరేగడి నేలల్లో 1,627 మట్టి నమూనాలు సేకరించి పంపినట్లు ఏఓ రవి గురువారం తెలిపారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏనేలలో ఏఏ పంటలు వేయాలి, ఎలాంటి ఎరువులు, మందులు వాడాలో తెలుస్తుందన్నారు. పంటలకు తెగుళ్లు రాకుండా కాపాడుకోవడమే గాకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు వీలుంటుందన్నారు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందకుండా పంటలు సాగు చేయవచ్చన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు ఉపయోగించకుండా వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు

మద్దికెర : ప్రస్తుతం దోమల బెడద, వాతావరణ మార్పుల కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయని, వాటిని నిర్లక్ష్యం చేయొద్దని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం ఆసుపత్రిలో ఆమె మాట్లాడుతూ.. తరచూ జ్వరం వచ్చి పోతుంటే వెంటనే సమీపంలోని వైద్యకేంద్రంలో రక్షపరీక్ష చేయించుకొని వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని చెప్పారు. అలా కాకుండా సొంత వైద్యంతో ఉపశమనం పొంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పరిస్థితి విషమించే ప్రమాదముందన్నారు. వైద్యపరీక్షలు స్థానిక ఆసుపత్రిలో ఉచితంగా చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ


నాగరాజును అభినందిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోలు

తుగ్గలి : మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ షర్మిల అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్ రాముడు, ఆర్‌ఐ సుధాకరరెడ్డి, వీఆర్వోలు, సిబ్బంది నాగరాజుకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

మద్దికెర : మండల తహసీల్దార్‌గా హుసేన్‌సాహెబ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది తహసీల్దార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు భూసమస్యలతో వస్తుంటారని వాటిని విచారణ చేసి సక్రమంగా రికార్డులు ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే విద్యా సంవత్సరం ప్రారంభమవుందని వారికి కావలసిన దరఖాస్తులు పరిశీలించి ధ్రువపత్రాలు విద్యార్థులకు అందజేయాలని చెప్పారు. రికార్డులు పక్కాగా వుండాలన్నారు. డీటీ గీతా ప్రియదర్శిని, ఆర్‌ఐ రవికుమార్, సూపరింటెండెంట్ సునీత, వీఆర్వోలు రంగస్వామి, పక్కీరప్ప, ఉశేన్, స్వర్ణమ్మ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వీఆర్వోలు

దేవనకొండ: మండల నూతన తహసీల్దార్‌గా బి.జయన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజలు మధ్యవర్తులను నమ్మి మోసపోరాదని, నేరుగా కార్యాలయానికి వచ్చి సమస్యలను చెప్పుకోవాలని సూచించారు.


బి.జయన్న

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి నూతన తహసీల్దార్‌గా చంద్రశేఖర్ వర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్యాపిలి మండలంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తూ సత్యసాయి జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణ అనంతరం జరిగిన బదిలీల్లో వెల్దుర్తి మండలానికి కేటాయించబడ్డారు. బాధ్యతల స్వీకరణ అనంతరం నూతన తహసీల్దార్ డీటీ ధనుంజయ రెడ్డి, మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి, వీఆర్‌ఓలతో సమావేశమై సీసీఆర్‌సీ కార్డుల దరఖాస్తుల వివరాలు, ధృవీకరణ పత్రాల జారీ వివరాలపై సమీక్షించారు.


చంద్రశేఖర్ వర్మ

ఎస్‌ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

హొళగుంద: పాఠశాల యాజమన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఈఓ–1 సత్యనారాయణ, ఎంఈఓ–2 జగన్నాథం తెలిపారు. మండలంలో మొత్తం 42 పాఠశాలలో 1 నుంచి 10 వ తరగతులు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఓటు హక్కు కలిగి ఉంటారని వారు చెప్పారు. 1న నోటిఫికేషన్ విడుదల, ఓటర్ల జాబిత ప్రదర్శన, 5న తుది ఓటర్ల జాబిత ప్రకటన, 8న ఎస్‌ఎంసీ సభ్యుల ఎన్నిక, మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అదే రోజు ప్రమాణ స్వీకారం, మొదటి సమావేశం నిర్వహణ ఉంటుందని చెప్పారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 8వ తేదీన ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని, ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశామని ఎంఈఓ–2 రమేశ్ తెలిపారు. మండలంలోని 61 ప్రభుత్వ పాఠశాలల నోటీసు బోర్డులో నోటిఫికేషన్ ప్రదిర్శంచడంతో పాటు, విద్యార్థుల తల్లితండ్రులకు సమాచారం అందించామని చెప్పారు.



వెల్దుర్తి ఎంపీపీ స్కూల్ నోటీసు బోర్డులో అతికించిన నోటిఫికేషన్

ఈ-క్రాప్ నమోదు ప్రారంభం

దేవనకొండ: మండలంలోని పొట్లపాడు గ్రామంలో వ్యవసాయాధికారి సురేష్‌బాబు గురువారం పంటల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు రైతుసేవా కేంద్రం సిబ్బంది ద్వారా పంటలను పరిశీలించి, రైతు, పంట ఫొటోను ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతుసేవా కేంద్రం సిబ్బంది ద్వారా ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఏఈఓ యోగి, వీఏఏలు అబ్దుల్ సలాం, సురేంద్ర, రైతు రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

ఈ– క్రాప్ నమోదు తప్పనిసరి

చిప్పగిరి: ఈ – క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి రైతులకు సూచించారు. గురువారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలకు ఈ–క్రాప్ బుకింగ్‌ను ప్రామాణికంగా తీసుకుంటారని చెప్పారు. కావున సాగు చేసిన ప్రతి పంటను ఈ–క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సమస్యలపై రైతులు అయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.


పొట్లపాడులో పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఆయాలపై వేధింపులు ఆపాలి

తుగ్గలి : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలపై రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న కోరారు. గురువారం వారు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, వాచ్‌మెన్లను రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడితెచ్చి బలవంతంగా తొలగిస్తున్నారన్నారు. కొన్నేళ్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ఇప్పటికే వారికి నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, మరోపక్క నాయకులు వారిని తొలగిస్తుండటంతో ఆ వేతనాన్ని కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలపై వేధింపులు ఆపేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

పరామర్శ


దూదేకొండలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి(పత్తికొండ) : పది రోజుల క్రితం దూదేకొండకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుమారులు సురేష్, మణి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో గురువారం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే.. మాజీ ఎమ్మెల్యేను తుగ్గలి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఇటీవల ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన ఎర్ర నాగప్ప మాజీ ఎమ్మెల్యేకు పూలబొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, మాజీ సభ్యుడు నారాయణనాయక్, నాయకులు నాగభూషణరెడ్డి, ఉమా మహేశ్వరరెడ్డి, బసిరెడ్డి, సర్పంచ్ మనీంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సుంకన్న, ఈశ్వర రెడ్డి, రఘు, వెంకటేష్‌నాయక్, కృష్ణానాయక్, రంజాన్, సుభాన్ ఉన్నారు.


కంగాటి శ్రీదేవిని కలిసిన తుగ్గలి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: కౌతాళంలో మతసామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలను, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

హంద్రీనీవాకు నీటిని విడుదల చేయాలి


ఎండుతున్న పంటను చూపుతున్న దృశ్యం

దేవనకొండ: హంద్రీనీవా కాలువలకు నీటిని విడుదల చేసి ఎండుతున్న పంటలను బతికించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు మునిస్వామి డిమాండ్ చేశారు. గురువారం రైతు మహాసభ సంఘం జిల్లా నాయకుడు బోయ మునిస్వామి ఆధ్వర్యంలో హంద్రీనీవా కాలువలు, పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ యేడాది ముందస్తుగా భారీ వర్షాలు కురిసినప్పటికీ.. ఆ తరువాత చినుకు కనుమరుగై సాగు చేసిన పంటలు ఎండుతున్నాయన్నారు. మండలంలో పత్తి, కంది, వేరుశనగ, ఆముదం తదితర పంటలు అధికంగా సాగు చేశారని, వర్షాభావ పరిస్థితులకు తోడు గాలి ఎక్కువగా, వీస్తుండటంతో వేగంగా ఎండుతున్నాయని చెప్పారు. రైతులు రహిమాన్, షఫీ, వలి, ధర్మ, శేఖన్న పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణంపై వాగ్వాదం


ఆలయ నిర్మాణంపై చర్చిస్తున్న మొలగవల్లి గ్రామస్తులు

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామ చెరువు కట్టపై భోగేశ్వర స్వామి ఆలయం నిర్మాణంపై గురువారం వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక చెరువు కట్టపై 200 ఏళ్ల క్రితం భోగేశ్వర స్వామి ఆలయం ఉండేది. నిర్మాణాన్ని ధ్రువపరిచేలా గ్రామ పంచాయతీ రికార్డులు ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ ఆలయ ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో గ్రామస్తులు ఇక్కడ నూతన భోగేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని దేవదాయ శాఖ అధికారులను కోరారు. దాతల సహకారంతో ఆలయం నిర్మించుకోవచ్చని ఆ శాఖ అధికారులు సూచించారు. దీంతో గ్రామానికి చెందిన ఓ దాత ఆలయం నిర్మించేందుకు ముందుకు వచ్చారు. అయితే కొందరు గ్రామస్తులు కల్పించుకొని చెరువు కట్టపై ఆలయం నిర్మిస్తే కట్ట బలహీనపడుతుందని సైడ్‌వాల్ నిర్మించాలని చెప్పారు. చర్చలో ఏదైనా సంఘటన జరుగుతుందని పోలీసులు గ్రామానికి చేరుకొని వారంలోగా ఉమ్మడిగా సమావేశం ఏర్పాటు చేసుకుని ఆలయ నిర్మాణంపై ఓ నిర్ణయానికి రావాలని పోలీసులు గ్రామస్తులకు సూచించారు.

వీఆర్పీఎస్ నాయకుల అరెస్ట్ దారుణం

ఆలూరు/చిప్పగిరి: వీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్నతో పాటు మరి కొందరిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని జిల్లా వాల్మీకి మహర్షి రిజర్వేషన్ పోరాటసమితి అధ్యక్షుడు లోక్‌నాథ్ గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. శ్రీశైలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా పులికొండన్నను అరెస్టు చేశారన్నారు. తాము ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని ప్రకటించలేదని, అలాంటప్పుడు హౌస్ అరెస్టు ఎందుకు చేశారని ప్రశ్నించారు. ముచ్చుమర్రి బాలిక ఆచూకీని చూపలేని ప్రభుత్వానికి తమ సంఘం నాయకుడిని అక్రమంగా నిర్బంధించే అధికారం లేదన్నారు. అలాగే.. అనంతపురం జిల్లాకు చెందిన బహుజన యువసేన అధ్యక్షుడు హరి, శ్రీశైలంలో నందికొట్కూరుకు చెందిన రవి అరెస్ట్‌పై కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు.


టీబీ డ్యాం 33 గేట్లు ఎత్తి నీటిని నదికి విడుదల చేస్తున్న దృశ్యం


హొళగుంద వద్ద నిండుగా పారుతున్న ఎల్లెల్సీ

టీబీ డ్యాంకు పోటెత్తిన వరద

హొళగుంద: టీబీ డ్యాంకు వరద ఉధృతి కొనసాగుతోంది. గురువారం రాత్రి 8 గంటల సమయంలో 2 లక్షల క్యూసెక్కులు నీరు డ్యాంకి చేరుతున్నాయి. ఎగువ భాగంలోని ఆగుంబే, శృంగేరి, తీర్థనహళ్లీ, వరనాడు, శివమొగ్గ , చిక్ మంగళూర్ తదితర దక్షిణ, ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గురువారం ఇన్‌ఫ్లో మళ్లీ పెరిగింది. దీనికి తోడు డ్యాం ఎగువన ఉన్న, తుంగా, భద్ర డ్యాంల నుంచి భారీగా వరద నీరు టీబీ డ్యాంకు చేరుతుంది. తుంగా డ్యాం నుంచి 80 వేలు, భద్ర డ్యాం నుంచి 65 వేల కూసెక్కుల నీటితో పాటు దిగువన కురుస్తున్న వర్షాలతో టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో పెరుగుతుంది. మంగళవారం 55,584 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, బుధవారం ఇన్‌ఫ్లో 1,05,973 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో మొత్తం 33 గేట్లు ఎత్తారు. గురువారం ఏకంగా సాధారణ ఇన్‌ఫ్లో 1,98,430 ఉండగా గంటకు 2,01,636 క్యూసెక్కుల నీరు జలాశయానికి వచ్చి చేరుతుంది. దీంతో 1,70,372 క్యూసెక్కుల నీటిని నదికి, కాలువలకు 9,564 క్యూసెక్కులు మొత్తం 1,79,936 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. డ్యాం 1633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండగా.. ప్రస్తుతం 1631.02 అడుగుల వద్ద 97.945 టీఎంసీలను నిల్వ ఉంచుకుని వచ్చిన నీటిని వచ్చినట్లే నదికి వదులుతున్నారు. జిల్లాలోని దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో ఆంధ్ర సరిహద్దు 250 కి.మీ వద్ద 293 క్యూసెక్కుల మేర నీటి ప్రవాహం నమోదైంది.

పింఛన్ల పంపిణీ

తుగ్గలి(పత్తికొండ) : పత్తికొండ పట్టణంలో గురువారం సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం ప్రారంభమైంది. కుమ్మరి వీధిలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొన్నారు. ప్రజలు నమ్మకంతో ఇచ్చిన అధికారాన్ని వారి సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందికలగనీయకుండా పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.

హొళగుంద: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో గురువారం సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అయితే కొన్ని చోట్ల పింఛన్ల పంపిణీ ఆలస్యం కావడంతో లబ్ధిదారులు సచివాలయాల వద్ద నిరీక్షించారు. ఎల్లార్తిలో లక్ష్మికాంత అనే దివ్యాంగుడు పింఛన్ కోసం తండ్రితో కలిసి గ్రామ సచివాలయం వద్దకు వచ్చి అధికారుల కోసం నిరీక్షించాడు. మధ్యాహ్న సమయంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఆజాద్ దివ్యాంగుడికి పింఛన్ సొమ్ము అందజేశారు. అలాగే పలువురు లబ్ధిదారులు సచివాలయం వద్దకే వచ్చి పింఛన్ తీసుకున్నారు. మండలంలో మొత్తం 6,025 పింఛన్‌లు ఉండగా 5,896 పింఛన్లను పంపిణీ చేసి 98 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.


పింఛన్ కోసం ఎల్లార్తి సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న దివ్యాంగుడు లక్ష్మీకాంత

ఆస్పరి: మండలంలోని గ్రామాలలో గురువారం పింఛన్ల పంపిణీ 97 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో 7,211 మంది పింఛన్‌దారులుండగా 7,049 మందికి సొమ్ము అందజేశామన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలో 7,966 మంది పింఛన్‌దారులుండగా గురువారం 97 శాతం (7,737మందికి) పింఛన్ పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు. 157 మంది సచివాలయ, పంచాయతీ సిబ్బందితో పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి లలిత ఎల్ నగరం, పుల్లగుమ్మిలో పంపిణీని తనిఖీ చేసి పలువురు లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. వెల్దుర్తి పట్టణంలోని 12వవార్డులో పింఛన్ పంపిణీలో బీజేపీ నాయకురాలు శాంతి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

హాలహర్వి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సంబరాలు జరుపుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడు, ఉపాధ్యక్షులు కిశోర్, మహేష్, సుధాకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించడం సంతోషకరమన్నారు.మునిస్వామి, జానప్ప, ముక్కన్న, రాజేష్, విఠల్, బాబురావు, భాస్కర్, పోలయ్య పాల్గొన్నారు.

హొళగుంద: ఎన్నో ఏళ్లుగా చేసిన పోరాటాలకు ప్రతిఫలంగా ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం చరిత్రాత్మమని దళిత సంఘాల నాయకులు చిన్నహ్యాట శేషగిరి, చిదానందప్ప, చిన్నహ్యాట నాగరాజు, దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం హొళగుందలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 30 ఏళ్లుగా సాగిన సుదీర్ఘ పోరాటాల్లో ఎందరో అమరులయ్యారన్నారు. ముద్దటమాగి నాగేంద్ర, ఎల్లార్తి చిదానంద, వెంటకేష్, బసప్ప, పల్లి ఈరన్న, అరుణ పాల్గొన్నారు.

చిప్పగిరి: వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్ మండల మండల అధ్యక్షుడు నెట్టికంటి హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ 30 సంవ్సరాలుగా చేసిన పోరాటానికి నేడు అనుకూలంగా తీర్పు వెలువడటంతో ఇప్పటికైనా ఎస్సీలకు న్యాయం జరుగుతుందన్నారు.


వెల్దుర్తిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతినిస్తూ గురువారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై వెల్దుర్తి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ముందుగా పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాణా సంచా పేల్చారు. నాయకులు బజారు, గిడ్డయ్య, ఐజయ్య, మోష, బాలరాజు, సూర్యచంద్ర, ప్రకాశ్, వెంకటరమణ, పాలు, రాజు, వెంకటేశ్, సుంకన్న, మహేశ్, నాగశేషు పాల్గొన్నారు.